# కుక్క ఉన్నది జాగ్రత్త

**స**త్యం రిటైర్ అయిన తర్వాత వాస్తు ప్రకారం ఒక యిల్లు కట్టాడు. తన వాచ్‌మేన్‌కి ఒక కుక్క వుండేది. అతను "కుక్క ఉన్నది జాగ్రత్త" అని గేటు మీద రాయించాడు. గృహప్రవేశమయిన తర్వాత కూడా, ఆ అక్షరాలు అలాగే ఉండిపోయాయి. కుక్కలేనప్పుడు ఆ అక్షరాలెందుకని, చెరిపించేద్దామనుకున్నాడు సత్యం.

"ఆ అక్షరాలు చెరిపిస్తే మళ్ళీ పెయింట్ వేయించాలి! మళ్ళా అదో ఖర్చు! అలా ఉండనివ్వండి" అంది సత్యం భార్య, సత్యవతి.

ఇంతలో లోపల్నుంచి వచ్చిన కోడలు "ఆ! ఫర్వాలేదు అలా వుంచేద్దాం! సేల్స్‌మెన్ బాధ తప్పుతుంది!" అంది.

ఒకసారి సత్యవతి మేనబావ పొద్దున్నే అయిదు గంటలకి ఊర్నుంచి వచ్చి, "కుక్క ఉన్నది" అన్న అక్షరాలు గేటుపై చూసి, భయపడి వెళ్ళిపోయాడు. తర్వాత ఫోన్ చేసి "యీసారి ఎప్పుడైనా వస్తాను" అన్నాడు. కుక్క వుందేమోనని భయపడి వెళ్ళిపోయాడని గ్రహించిన సత్యవతి, నవ్వుకుంది.

నవ్వుకు కారణమడిగిన సత్యానికి చెప్పింది. "మా బావకి చిన్నప్పట్నుంచీ కుక్క అంటే చాలా భయం! అందుకే అతన్ని, "కుక్కబావ" అని పిలుస్తూ ఏడిపించేవాళ్ళం!"

"అయితే కొత్తగా యిల్లు కట్టిన ప్రతీవాడూ "కుక్క ఉన్నది" అని బోర్డుపెడితే కొన్నాళ్ళు చుట్టాల తాకిడి ఉండకుండా, ఆర్థికంగా కొంత స్థిమితి పడవచ్చు", అన్నాడు సత్యం.

తర్వాత కొన్నాళ్ళకి సత్యం మిత్రుడొకడు వచ్చాడు. "సత్యం! నువ్వు యిల్లు కట్టడానికి చాలా డబ్బు ఖర్చుపెట్టి కూడా, ఒక కుక్కను పోషిస్తున్నావంటే గొప్పే! అయినా నీకెందుకురా కుక్క! నువ్వున్న చోటికి వేరే దొంగ ఎవడొస్తాడ్రా!" అన్నాడు.

"అంటే ఏమిట్రా నీ ఉద్దేశ్యం, నేనే ఒక దొంగననా!" "ఇంకా సందేహమా! నేనొచ్చి రెండ్రోజులయింది! అసలు కుక్క కనిపించకపోతే పోయె! మొరగలేదు

కూడాను! కుక్కలేకుండానే కుక్క ఉన్నది అని రాయించినవాడవు దొంగ కాక మరేమవుతావ్!" అన్నాడు మిత్రుడు.

"దొంగలు దొంగలతోనే స్నేహం చేస్తారు కనుక, నువ్వు కూడా దొంగవే మరి!" అన్నాడు సత్యం.

ఒకసారి సత్యం యింట్లో, ఆరితేరిన దొంగలు పడ్డారు. మత్తు మందు కలిపిన బిస్కెట్లతో సహా వచ్చారు. ఎంత వెదికినా కుక్క కనిపించలేదు. విసిగిపోయి, సత్యాన్ని లేపి నాలుగు గుద్దులు గుద్ది, "కుక్క ఎక్కడ ఉందో", చెప్పమన్నారు.

"అసలు, కుక్క లేదు బాబోయ్!" అని కుర్రో మొర్రో అన్నాడు సత్యం.

"కుక్కలేకుండానే కుక్క ఉన్నదని ఎందుకు రాయించావు. మేమసలే పెద్ద దొంగలం. మాతో ఆటలా! ఎవరైనా అబద్ధాలాడితే సహించేది లేదు. పట్రా ఉన్న డబ్బు మొత్తం తీసుకురా!" అన్నారు.

"ఉన్న ఎనిమిది వందలూ తెచ్చాడు. సిగ్గులేదా! ఇంత పెద్ద ఇల్లు కట్టావు. ఇంత తక్కువ డబ్బు ఇస్తావా? పైగా యీ బిస్కెట్ల ఖర్చొకటి మాకు!" అని యింకో నాలుగు గుద్దులు వడ్డించి, వెళ్ళిపోయారు.

వాళ్ళు వెళ్ళిన తర్వాత "అబ్బా! చాలా గట్టిగా గుద్దారు వెధవలు!" అన్నాడు సత్యం.

"జాగ్రత్త! వింటే మళ్ళీ గుద్దుతారు! మన పెళ్ళైనప్పట్నుంచి చూస్తున్నాను మిమ్మల్ని! మీరు చాలా పిసినారి! డబ్బులైనా ఉండాలి! గుద్దులైనా కాయాలి! ఈ పైన కష్టమో నిష్ఠూరమో, కనీసం అయిదువేలైనా యింట్లో పెట్టండి!" అంది సత్యం భార్య.

ఒకసారి ఆరుబయట కూర్చుని పేపరు చదువుకుంటున్న సత్యం దగ్గరికి, ఒకతను వచ్చి, తనతో తీసుకువచ్చిన కుక్కని చూపిస్తూ "దీన్ని చూడండి సార్! ఎంత దీనంగా ఉందో! దీని భర్త పోయాడు. మీ దగ్గరున్నది మగ కుక్క అయితే దీనికి జత కలిపి, దీని బెంగ పోగొట్టడానికి, మీ సహాయం అడగడానికి వచ్చాను" అన్నాడు.

ఇదేమిట్రా బాబూ, యిదొక కొత్త సమస్య! అసలు కుక్కేలేదు మళ్ళీ లింగభేదం ఒకటా, అని సత్యం కంగారుపడుతున్న సమయంలో, సత్యవతి వచ్చి 'మాదీ ఆడకుక్కే' అంది.

"ఇక లాభంలేదు. ఆ అక్షరాలైనా చెరిపించెయ్యాలి, లేకపోతే ఒక కుక్కనైనా పెంచాలి!" అన్నాడు సత్యం.

సత్యవతి ఏం సమాధానం చెప్పలేదు. కోడల్ని పిలిచి 'నీవైనా మీ అత్తగార్కి చెప్పి ఒప్పించమ్మా! యీ అక్షరాలు చెరిపించేద్దాం! అన్నాడు సత్యం.

"మీరు తీర్థయాత్రలకి వెడుతున్నారు కదా! మీరు వచ్చిన తర్వాత చెరిపిద్దాం!" అంది కోడలు.

తీర్థయాత్రలు పూర్తిచేసుకువచ్చిన సత్యానికి, ఆ గేటు మీద అక్షరాలు కనిపించలేదు.

ఆశ్చర్యంతో 'మంచి పని చేయించావమ్మా!" అన్నాడు కోడలితో.

"నేను కాదు! మా నాన్నగారు చేయించారు" అంది కోడలు.

"పోన్లే అమ్మా! మా వియ్యంకుడు చాలా మంచి పని చేయించారు!" అన్నాడు సత్యం.

అసలు ఒక ముఖ్యమైన విషయం సత్యానికి తెలీదు. అతను తీర్థయాత్రలకి వెళ్ళినప్పుడు వచ్చిన వియ్యంకుడు, యీ కుక్క ప్రహసనాలు విని "అసలెందుకమ్మా! ఆ గృహప్రవేశానికి ముందే ఆ అక్షరాలు చెరిపించెయ్యవలసింది!" అన్నాడు.

"నీకు తెలియదు నాన్న! మా మామగారు తక్కువవాడు కాదు! మధ్య మధ్యలో, నామీద 'భౌ,భౌ' అని అరుస్తాడు. అందుకనే యిన్నాళ్ళు ఆ అక్షరాలు చెరపనివ్వలేదు!" అంది.

"తప్పమ్మా! మామగారు తండ్రితో సమానం! నీకు, నేనూ, ఆయనా ఒకటే! ఇటువంటి పనులు చెయ్యకూడదు!" అని ఆ అక్షరాలు చెరిపించేశాడు, వియ్యంకుడు.

అసలు తన కోడలి సూక్ష్మ బుద్ధి తెలిస్తే కుదేలయి పోయేవాడు సత్యం.

(రంజని (దసరా-దీపావళి), 2005)